

జేఎన్‌టీయూహెచ్‌లో స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో వీసీ కిరణ్‌కుమార్ రెడ్డి, రెక్టార్ దామోదరం, రిజిస్ట్రార్

## ఎప్‌సెట్ ఇంజనీరింగ్ స్లైడింగ్‌లో..

# 2,856మంది బ్రాంచ్‌ల మార్పు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఎప్‌సెట్ ఇంజనీరింగ్ మూడో విడత కౌన్సెలింగ్ అనంతరం ఆయా కాలేజీల్లో ఇంటర్నల్ స్లైడింగ్ ప్రక్రియకు సంబంధించిన ఫలితాలను సాంకేతిక విద్యాశాఖ శనివారం విడుదల చేసింది. ఈ నెల 12, 13తేదీల్లో మొత్తం 6,751మంది సెంట్రలైజ్డ్ ఇంటర్నల్ స్లైడింగ్‌కు ఆప్షన్లు ఇచ్చుకోగా, 2,856మందికి బ్రాంచ్‌లు మారాయి. బ్రాంచ్‌లు మారిన విద్యార్థులు అదేకాలేజీలో కొత్త ఎలాట్‌మెంట్ ఆర్డరుతో ఈనెల 17లోగా రిపోర్టు చేయాలని అధికారులు సూచించారు.

### 19, 20తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు

రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి ఈనెల 17న సాంకేతిక విద్యాశాఖ నోటిఫికేషన్ జారీ చేయనుంది. 19, 20 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు జరుపుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు. మార్గదర్శకాలు, ఇతర వివరాల కోసం ఎప్‌సెట్ వెబ్‌సైట్లో చూడవచ్చని అధికారులు తెలిపారు.

## విలువలతో ముందుకు సాగుదాం

- విద్యార్థులు, ఆచార్యులకు జేఎన్టీయూ వీసీ పిలుపు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): స్వేచ్ఛ, సమానత్వం, ఐక్యత, సమగ్రత, సామాజిక బాధ్యత వంటి విలువలతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని జేఎన్‌టీయూ వైస్‌చాన్స్‌లర్ కిషన్‌కుమార్ రెడ్డి విద్యార్థులకు, ఆచార్యులకు పిలుపునిచ్చారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఉదయం వర్సిటీ ప్రాంగణంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది విశ్వవిద్యాలయంలో చేపట్టిన వివిధ కార్యక్రమాల గురించి వివరించారు. బజాజ్ ఇంజనీరింగ్ స్కిల్స్ ట్రైనింగ్ (బెస్ట్) ల్యాబ్స్ స్థాపన, ఏఐసీటీఈ ఇండోవేషన్ సెంటర్‌లో కార్యకలాపాలను అధికారికం చేయడం, కోర్ ఎలక్ట్రానిక్స్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు కోసం ఈఎస్‌సీఐతో అవగాహన ఒప్పందం, కోస్గి, మధిరలో కొత్తగా రెండు వర్సిటీ అనుబంధ కళాశాలల చేరిక వంటి అంశాలు ఉన్నాయన్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణతో కూడిన దేశభక్తి వాతావరణాన్ని తీసుకురావాలని ఆచార్యులకు, ఎన్‌సీసీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ దామోదరం, రిజిస్ట్రార్ జయలక్ష్మి, డైరెక్టర్లు కామాక్షిప్రసాద్, వసుమతి, సుషమ, బాలునాయక్, సత్యసావిత్రి, కృష్ణమోహనరావు, అనితాశీల, ప్రిన్సిపాల్స్ నర్సింహారెడ్డి, సింధు, పరిశోధక విద్యార్థులు, ఆచార్యులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జెండా వందనం చేస్తున్న వైస్ చాన్స్‌లర్ కిషన్‌కుమార్ రెడ్డి